వీధి కుక్కలతో ప్రజలు బెంబేలు

- రోడ్డుపైకి రావాలంటే భయపడుతున్న ప్రజలు
- వాహనాలపై పరిగెత్తి కరుస్తున్న వీధి కుక్కలు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు



వెంగళాయపాలెం ప్రధాన రహదారిలో వీధి కుక్కలు

గుంటూరు రూరల్: వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. వీధుల వెంట తరుముతున్నాయి. పిల్లాపాపలూ లెక్కలేదు. ప్రతిఒక్కరిని టార్గెట్ చేస్తున్నాయి. ఇంట్లోనుంచి బయటకు రావాలంటే భయం ఏ వీధిలో నుంచి ఏ వీధి కుక్క వచ్చి కరుస్తుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రోడ్లపై తిరిగే వాహనాలపై పరిగెత్తి కరిచేందుకు వస్తున్నాయంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఏఏ గ్రామాల్లో..

మండలంలోని నగర శివారు గ్రామాలైన చల్లావారిపాలెం, వెంగళాయపాలెం, తురకపాలెం, గోర్లవారిపాలెం, అడవితక్కెళ్ళపాడు, లాలుపురం, ఓబులునాయుడుపాలెం తదితర గ్రామాల్లో వీధుల్లో తిరిగే వీధి కుక్కలను చూసి ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. నగరంలోని వీధి కుక్కలను పట్టి కార్పొరేషన్ అధికారులు వాటిని ఏటుకూరు శివారుల్లో, నాయుడుపేట, వెంగళాయపాలెం, పొత్తూరు గ్రామాల శివారులైన డంపింగ్ యార్డు పరిసర ప్రాంతాల్లో వదిలేస్తున్నారని, దీంతో ఆ కుక్కలు సమీప గ్రామాల్లోకి వచ్చి కనిపించిన ప్రతి ఒక్కరిని కరిచి ఇబ్బందులకు గురిచేస్తున్నాయని గ్రామాల్లోని ప్రజలు వాపోతున్నారు. గ్రామాల్లో వీధి కుక్కలకు భయపడి వృద్ధులు బయటకు రావాలంటే వణికిపోతున్నామంటున్నారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో చిన్నారులు పాఠశాలలకు వెళ్లాలన్నా భయపడాల్సిన పరిస్థితి వచ్చిందని, ఏ కుక్క ఏ వీధిలోంచి వచ్చి చిన్నారులను కరుస్తాయోనని భయాందోళన చెందాల్సి వస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోయారు.

వాహనాలను వదలడం లేదు..

నడిచిపోయే వారి సంగతి అలా ఉంచితే కనీసం ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లను వెంటాడుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. వాహనాల వెంటపడి కరిచేందుకు వస్తున్నాయని అంటున్నారు. పగటి సమయాల్లోనే పరిస్థితి ఇలా ఉంటే రాత్రి సమయాల్లో బయటకు రావాలంటే వణుకు పుడుతుందని ప్రజలు అంటున్నారు.

నెల రోజుల్లో పది మందిని..

ప్రతి గ్రామంలో కనీసం నెల రోజుల్లో పది మందికి పైగా వీధి కుక్కల బారిన పడి కరిచి ఆస్పత్రిల్లో చికిత్స పొందారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో వీధి కుక్కలను పట్టించి గ్రామాల ప్రజలు ప్రాణాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

వీధుల్లోకి వచ్చేందుకు భయమేస్తుంది



వీధుల్లో పదుల సంఖ్యలో వీధి కుక్కలు తిరుగుతూ బయటకు వస్తే వెంటపడి కరుస్తున్నాయి. స్కూలుకు చిన్నారులను పంపాలన్నా ఆందోళన చెందాల్సిన పరిస్థితి. వృద్ధులను కూడా కరుస్తున్నాయి. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

– టి.శ్రీలక్ష్మి, నల్లపాడు

వెంటపడి కరుస్తున్నాయి



వీధి కుక్కలు వీధుల్లో తిరుగుతూ కరుస్తున్నాయి. వీధిల్లో కట్టేసే గేదెలు, ఆవులపై దాడి చేస్తున్నాయి. గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రతి ఒక్కరిని భయకంపితులను చేస్తున్నాయి. ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. వీధికుక్కలను పట్టుకుని అరికట్టాలి.

–బి.దుర్గా, వెంగళాయపాలెం

ప్రతి రోజు బాధితులు



ప్రతి రోజు ఎవరో ఒకరిని కరుస్తూనే ఉన్నాయి. నగర శివారుల్లో నగరంలోని కుక్కలను తీసుకు వచ్చి వదిలేస్తున్నారు. దీని వల్ల గ్రామాల్లో కుక్కలను వదిలిన కుక్కలు కరుస్తున్నాయి. దీని వల్ల రేబీస్ వ్యాధులు ప్రబలుతాయేమోనని భయాందోళన చెందుతున్నారు.

–వంగా నవీన్‌రెడ్డి, జొన్నలగడ్డ

క్లుప్తంగా

అర్జీలకు సత్వరమే పరిష్కారం



పొన్నూరు: వివిధ సమస్యలపై మండల తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే అర్జీలను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని తహసీల్దార్ జియా వుల్ హక్ అన్నారు. సోమవారం కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. తహసీల్దార్‌ను బీసీ సంక్షేమ సంఘం నాయకులు కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం సంఘ అధ్యక్షులు కె.అనిల్ కుమార్, కార్యదర్శి మీరావలి, మండల అధ్యక్షులు షేక్ షాపూర్, కేశన సతీష్ కుమార్, బాజీ సాహెబ్, లక్కు కోటేశ్వరరావు, షేక్ సైదులు తదితరులు పాల్గొని తహసీల్దార్‌ను సత్కరించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నగరంపాలెం: పోలీస్ అమరవీరుల స్మారకోత్సవాల్లో భాగంగా విద్యార్థులు, పోలీస్ సిబ్బంది, వారి పిల్లలకు సోమవారం వక్తృత్వ, వ్యాసరచన పోటీలు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించారు. సైబర్ నేరాల నివారణలో యువత పాత్ర, ప్రస్తుత వాతావరణంలో పోలీసులకు సవాళ్లు అనే అంశాలపై పోటీలు నిర్వహించారు. జిల్లా ఏఎస్పీ(ఏఆర్) హనుమంతు, డీఎస్పీలు శాంత కుమార్, బి.సీతారామయ్య (ఎస్‌బీ), ఆర్‌ఐలు హరిరెడ్డి, శివరామకృష్ణ పర్యవేక్షించారు.

ఉద్యోగులు నిజాయతీగా పనిచేయాలి



లక్ష్మీపురం: అవినీతి రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం(సీజీహెచ్‌ఎస్) చీఫ్ మెడికల్ ఆఫీసర్ టి.హెచ్.కోటేశ్వరరావు అన్నారు. కేంద్ర విజిలెన్స్ కమిషన్ ఆదేశాల మేరకు వారం రోజులపాటు నిర్వహిస్తున్న విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను కలెక్టరేట్ రోడ్డు లోని సీజీహెచ్‌ఎస్ కార్యాలయంలో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగులు అవినీతికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సి.జి.హెచ్.ఎస్. డాక్టర్ డి.తుకారాం, ఫార్మాసిస్టులు ఆయేషా బేగం, సునీల్, మినిస్టీరియల్ ఉద్యోగులు రామారావు, మురళీకృష్ణ, మక్బూల్, రత్నరాజు, వెంకటేశ్వర్లు, నందమణి పాల్గొన్నారు.

సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

లక్ష్మీపురం: తాడేపల్లి మండలం కృష్ణనగర్‌లోని ఎ.సి.సి. సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు న్యాయం చేయాలని కోరుతూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న వివిధ రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాల నాయకులపై పోలీసులు పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు సి.హెచ్.బాబూరావు డిమాండ్ చేశారు. బ్రాడీపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.నేతాజి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ 2015లోనే హైకోర్టు, లేబర్ కోర్టు కార్మికులకు నష్టపరిహారం ఇవ్వాలని తీర్పుచెప్పినా, తీర్పును అమలు జరపలేదన్నారు. స్థానిక శాసన సభ్యులు లోకేష్ ఎన్నికలకు ముందు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు, కె.నళినీకాంత్, ఎం.రవి, ఎస్.భావన్నారాయణ, ఎస్.ఎస్.చెంగయ్య పాల్గొన్నారు.

2న మండల సర్వసభ్య సమావేశం

పెదకాకాని: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నవంబరు 2వ తేదీ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రమావత్ శ్రీనివాసరావు తెలిపారు. సమావేశానికి మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు తుల్లిమిల్లి శ్రీనివాసరావు అధ్యక్షత వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పూర్తి సమాచారంతో తప్పక హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

నేటి నుంచి కంప్యూటర్ శిక్షణ

నగరంపాలెం: షిరిడి సాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి ఉచిత కంప్యూటర్ శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ నిర్వాహకులు మూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పేద, మధ్య తరగతి విద్యార్థులకు కంప్యూటర్ కోర్సులైన ఎంఎస్ ఆఫీస్, టాలీ అకౌంట్స్, మల్టీ మీడియాలో శిక్షణ అందిస్తామని చెప్పారు. ఆసక్తి ఉన్న వారు అమరావతిరోడ్డు బాలాజీనగర్ 8వ వీధిలోని షిరిడి సాయి సేవా ట్రస్ట్– స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో, 97047 89299, 86862 15922 సంప్రదించాలని పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తపై దాడి

గుంటూరు రూరల్: పుట్టినరోజు వేడుకల్లో సౌండ్ బాక్స్‌లతో పాటలు పెట్టుకున్నారన్న అక్కసుతో వైఎస్సార్ సీపీ కార్యకర్తపై టీడీపీ కార్యకర్తలు దాడిచేసిన ఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాలు.. తోకావారిపాలేనికి చెందిన దాసరి సాగర్‌బాబు పుట్టినరోజు వేడుకలు జరుపుకుంటూ ఇంటి సమీపంలో సౌండ్ బాక్స్‌లతో పాటలు పెట్టుకున్నారు. ఈ క్రమంలో సమీపంలో ఇంటిలోని టీడీపీ కార్యకర్తలు నల్లగొండ కోటయ్య, నల్లగొండ స్వాతి, నల్లగొండ జ్యోతి సాగర్‌తో పాటలు ఆపేయాలని వివాదానికి దిగారు. పాటలు ఆపి ఇంటికి వెళ్లిన సాగర్‌ను అతడి ఇంటికి వెళ్లి దాడిచేసి గాయపరిచారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన



చేబ్రోలు: మూడు నెలలుగా వేతనాలు లేకుండా పనిచేస్తున్న 108 సిబ్బందికి జీతాలు ఇవ్వాలని 108 సిబ్బంది మొరపెట్టుకుంటున్నారు. చేబ్రోలు, వట్టిచెరుకూరు ప్రాంతాలకు చెందిన 108 సిబ్బంది వారం రోజులుగా 108 సర్వీసు కాంట్రాక్టు ఎంప్లాయీస్ యూనియన్ పిలుపు మేరకు నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మండల కేంద్రమైన చేబ్రోలులో సోమవారం నల్ల బ్యాడ్జీలతో కొద్ది సేపు నిరసన తెలిపారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు వై శివ శంకరరావు, బి.యహోషావా, జయకుమార్ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

అధ్యాపకురాలికి బెస్ట్ ఉమెన్ ఇంజినీరింగ్ టీచర్ అవార్డు



అవార్డు పొందిన అధ్యాపకురాలు శ్రీ కృష్ణను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఐఎస్‌టీఈ) నుంచి బెస్ట్ ఉమెన్ ఇంజినీరింగ్ టీచర్– 2023 స్టేట్ అవార్డు తమ కళాశాల అధ్యాపకురాలు ప్రొఫెసర్ డాక్టర్ ఏ శ్రీకృష్ణకు లభించడం గర్వకారణమని ఆర్‌వీఆర్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని పేర్కొన్నారు. సోమవారం చౌడవరంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన అధ్యాపకురాలి అభినందన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఐఎస్‌టీఈ ఆధ్వర్యంలో వివిధ విభాగాల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అవార్డుల ఎంపికలలో వచ్చిన అభ్యర్థులను స్క్రీనింగ్ జరిపి విద్యా బోధనా, వివిధ పరిశోధనలకుగానూ కళాశాలకు చెందిన డాక్టర్ ఏ శ్రీకృష్ణకు అందించారన్నారు. కార్యక్రమంలో కళాశాల ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎస్వీ శ్రీనివాసరావు, తదితరులు అవార్డు పొందిన అధ్యాపకురాలిని అభినందించారు.

యువజనోత్సవాల్లో చిప్స్ విద్యార్థుల ప్రతిభ



పోటీలలో విజేతలతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల యువజనోత్సవాల్లో తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను చూపి అవార్డులను పొందారని చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విద్యాధర్ తెలిపారు. చౌడవరంలోని కళాశాలలో విద్యార్థుల అభినందన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏఎన్‌యూ యువజనోత్సవాల్లో వివిధ రకాల కళా సాంస్కృతిక పోటీలు నిర్వహించారని చెప్పారు. పోటీలకు కళాశాల విద్యార్థిని, విద్యార్థులు స్పోర్ట్స్, సాంస్కృతిక విభాగాధిపతి డాక్టర్ జె.సుబ్బారావు ఆధ్వర్యంలో పాల్గొన్నారన్నారు. పోటీలలో తమ కళాశాల విద్యార్థులు టి.భానుయశస్వి, ఫొటోగ్రఫీలో ప్రథమ బహుమతి, ఇన్‌స్టాలేషన్‌లో డీ సాయిరాం బృందం తృతీయ స్థానం, క్లే మౌల్డింగ్‌లో బి స్వామి ద్వితీయ స్థానం, స్పాట్ పేయింటింగ్‌లో కన్సోలేషన్ బహుమతిని పొందారన్నారు. విజేతలకు కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ సీఎస్ శ్రీనివాస్, కోశాధికారి ఆర్.గోపాలకృష్ణ, అదనపు కార్యదర్శి డాక్టర్ కె.కృష్ణప్రసాద్, సంయుక్త కార్యదర్శి చుక్కపల్లి రమేష్ అభినందించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

న్యాయమూర్తి అంజనీ ప్రియదర్శిని



విద్యార్థులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి

పొన్నూరు: ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థినులకు నాణ్యమైన భోజనం, ఇతర సౌకర్యాలను అందించాలని పొన్నూరు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ ఎం.అంజనీ ప్రియదర్శిని హాస్టల్ నిర్వాహకులను ఆదేశించారు. సోమవారం పట్టణంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని న్యాయమూర్తి ఆకస్మిక తనిఖీ చేశారు. బాలికల లివింగ్ రూమ్, బాత్రూమ్, టాయిలెట్, హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. హాస్టల్లోని భోజన, వసతి సౌకర్యాలను విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. హాస్టల్‌తో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని వార్డెన్‌ను కోరారు. కార్యక్రమంలో కోర్టు సూపరింటెండెంట్ ఎం. హరీస్‌బాబు పాల్గొన్నారు.

హాస్యం ఒక ఆప్తమిత్రుని వంటిది

లక్ష్మీపురం: 'హాస్యం ఒక ఆప్తమిత్రుని వంటిదని, అది మనల్ని నవ్విస్తుంది.. కవ్విస్తుంది.. ఆనంద పరవశుల్ని చేస్తుందని, అది మన పరిచయాల్ని పెంచుతుందని రచయిత, సినీ దర్శకుడు కె.జయకుమార్ అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం హాస్యవల్లరి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హాస్యం ఉత్సాహంగా..ఆనందంగా జీవించడానికి అవసరమైన పరిసరాలను సృష్టిస్తుందని, గొప్ప ఔషధిలా పని చేస్తుందన్నారు. నటుడు, రచయిత కొప్పరాజు విజయసారథి బాబు మాట్లాడుతూ నవ్వు ఆకర్షణీయమైనదో.. ఆనందకరమైనదో మాత్రమే కాదని ఆరోగ్య ప్రధానమైనదని, వైద్య రంగ ప్రముఖులు ప్రకటిస్తున్నారని చెప్పారు. హాస్య ప్రియులు పాల్గొన్నారు.

చలపతిలో వైద్య శిబిరం

గుంటూరు రూరల్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం నగర శివారుల్లోని లాం లోని కళాశాలలో అశోక్‌లైలాండ్ ఆటోమోటివ్, అపోలో టైర్స్ హెల్త్‌కేర్ సెంటర్ సంయుక్తంగా ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాలలోని 150 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు.

బుధ, శనివారాల్లో వ్యాక్సినేషన్

గుంటూరు మెడికల్: సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో భాగంగా ఈనెల 25న రాష్ట్ర వ్యాక్సిన్ స్టోర్స్ నుంచి అన్ని రకాల వ్యాధి నిరోధక టీకాలు జిల్లా వ్యాక్సిన్ స్టోర్స్‌కు సరఫరా చేయడం జరిగిందని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు సోమవారం తెలిపారు. వీటిని జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలకు సరఫరా చేసినట్లు చెప్పారు. చిన్నారులకు అన్ని రకాల వ్యాధి నిరోధక టీకాలు బుధ, శనివారాల్లో జరిగే వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో అందజేస్తున్నట్లు వెల్లడించారు.

ఇంజినీరింగ్ సెక్షన్‌లో అంతర్గత బదిలీలు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ సెక్షన్‌లో ఇంజినీరింగ్ అధికారుల అంతర్గత బదిలీలు, మరికొంత మందికి విధులు కేటాయిస్తూ నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈస్ట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా సుందరరామిరెడ్డి, వెస్ట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా కె.కోటేశ్వరరావు, ఇతర అధికారులకు విధులు కేటాయిస్తూ ఆదేశాలు ఇచ్చారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నెహ్రూనగర్: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద సీఐటీయూ నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్(సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమ్మె ముగిసి తొమ్మిది నెలలు అయినప్పటికీ ఇంత వరకు సమ్మె కాలానికి జీతం ఇవ్వలేదన్నారు. అదే విధంగా పండుగ కానుక కింద రూ.వెయ్యి వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నగర అధ్యక్షులు పూనేపల్లి శ్రీనివాసరావు, నాయకులు సోమి శంకరరావు పాల్గొన్నారు.

డ్రోన్ టెక్నాలజీతో యాజమాన్య పద్ధతులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న విద్యార్థినులు

గుంటూరు రూరల్: మండలంలోని జొన్నలగడ్డలో ఆధునిక సాంకేతిక యాంత్రీకరణలో భాగంగా డ్రోన్ సహాయంతో పంటపై పురుగు, తెగులు, సూక్ష్మ పోషకాల మందులు పిచికారిపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. గ్రామంలోని ఉత్తమ రైతు అవార్డు గ్రహీత వంగా నవీన్‌రెడ్డి ఆధ్వర్యంలో పొలంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్రోన్ సహాయంతో ఖర్చులు తగ్గించుకోవచ్చని, ఎక్కువ నీరు అవసరం లేదని బాపట్ల వ్యవసాయ కళాశాల అగ్రికల్చర్ విద్యార్థులు రైతులకు సూచించారు. డ్రోన్‌తో రోజుకు సరాసరి 18–22 ఎకరాలు పిచికారి చేయవచ్చన్నారు. డ్రోన్ సహాయముతో పిచికారి చేసేందుకు ఒక ఎకరానికి రూ.250 మాత్రమే ఖర్చు అవుతుందని వివరించారు. కార్యక్రమంలో రైతులు నామ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఈ– ఆటోలు కదిలితే ఒట్టు

- పట్టణంలో నత్తనడకన చెత్త సేకరణ
- పట్టించుకోని అధికారులు



మరమ్మతులకు నోచుకోక నిలిచిన ఆటోలు

పొన్నూరు: పట్టణంలోని 31 వార్డుల్లో ప్రస్తుతం ఇంటింటి చెత్త సేకరణ నత్తనడకనే సాగుతోంది. ఈ ఆటోలు పూర్తి స్థాయిలో వినియోగంలో లేక ఈ పరిస్థితి నెలకొంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో పారిశుద్ధ్య కార్మికులకు కష్టాన్ని తగ్గించి, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్న ధ్యేయంతో భారీ వ్యయంతో కొనుగోలు చేసి పురపాలక సంఘానికి 6 ఈ–ఆటోలు కేటాయించారు. ప్రతి రోజు పట్టణంలో దాదాపు 35 టన్నుల చెత్త సేకరణ జరుగుతోంది. ఈ ఆటోలతో ప్రతి ఇంటికి వెళ్లి తడి, పొడి చెత్త సేకరణ ఆరంభంలో ముమ్మరంగా సాగింది. పలు సాంకేతిక కారణాలతో మొరాయించిన 6 ఈ ఆటోలు కొన్ని నెలలుగా మరమ్మతులకు నోచుకోక మూలకుచేరాయి.

నిర్లక్ష్యంతో మూలన..

ప్రజారోగ్య విభాగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పాడైన ఆటోలను పట్టించుకోకుండా పక్కన పెట్టేశారు. ప్రజావసరాలకు వినియోగించే ఎలక్ట్రిక్ వాహనాలు నేటికీ వినియోగంలోకి రాకపోవడంతో పట్టణంలో చెత్త సేకరణ సక్రమంగా సాగడం లేదు. ఇంటింటా చెత్త సేకరిస్తున్న పారిశుద్ధ్య కార్మికులపై అదనపు భారం పడింది. చెక్క బండ్లతోనే చెత్త సేకరణ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. చందోలు రోడ్డులోని డంపింగ్ యార్డుకు సేకరిస్తున్న టన్నుల కొద్దీ చెత్తను ప్రస్తుతం ట్రాక్టర్లతోనే తరలిస్తున్నారు. ఫలితంగా వాటిని నిడుబ్రోలు ప్రజారోగ్య విభాగంలో వెనుక పడేశారు. ఒక్కటి మాత్రమే చెత్త సేకరణకు వినియోగిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చెత్త సేకరణ వేగవంతంగా జరిగేందుకు ఈ ఆటోలను వెంటనే వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ ఆటోలను వినియోగంలోకి తెస్తాం



మొరాయించిన ఈ ఆటోలలో ఇటీవల మూడింటికి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకొచ్చాం. త్వరలోనే మరో మూడు ఆటోలను కూడా వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు చేపడుతున్నాం.

–శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, పొన్నూరు

తెలుగు క్రీడాకారులను ప్రోత్సహించాలి

పవర్ లిఫ్టర్‌ను అభినందిస్తున్న తులసి ధర్మచరణ్



దివ్య అభినందిస్తున్న ధర్మచరణ్

కొరిటెపాడు: అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే తెలుగు క్రీడాకారులు, అథ్లెట్‌లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా నిలవాలని వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ కోరారు. తెనాలి మండలం కఠెవరానికి చెందిన పవర్ లిఫ్టర్ నాగం జ్ఞానదివ్య కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో భారతదేశం తరపున నాలుగు కాంస్య పతకాలు సాధించటంపై ధర్మచరణ్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పవర్ లిఫ్టర్ నాగం జ్ఞానదివ్యను ధర్మచరణ్ అభినందించి, సత్కరించారు. తులసి ధర్మచరణ్ మాట్లాడుతూ జ్ఞానదివ్యకు గతంలో పలు సార్లు ఆర్థిక తోడ్పాటును అందజేశానని, భవిష్యత్ లో కూడా తాను పాల్గొనబోయే చాంపియన్‌షిప్‌లకు ఆర్థికపరంగా అండగా ఉంటానని ధర్మచరణ్ హామీ ఇచ్చారు.

పారిశుద్ధ్యం విధుల్లో నిర్లక్ష్యం తగదు

కార్పొరేషన్ కమిషనర్ శ్రీనివాసులు



నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని, ఇప్పటికే నగరంలో 90 రోజుల స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేస్తున్నా కొందరు నిర్లక్ష్యంగా ఉంటున్నారని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం పండరీపురం, అశోక్‌నగర్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు పరిశీలించి, పనులపై అసహనం వ్యక్తం చేసి స్థానిక శానిటేషన్ కార్యదర్శిని విధుల నుంచి సస్పెండ్ చేయాలని, అరండల్ పేట మెయిన్ రోడ్‌లో శంకర్ విలాస్ ఆర్‌ఓబీ మార్కింగ్‌ని పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. తొలుత పండరీపురం 2,3 లైన్లు పరిశీలించి, రోడ్ల మీద గార్బేజ్ కుప్పలు ఉండడం, డ్రైయిన్లలో మురుగుపారుదల లేకుండా ఉండడం గమనించి, పారిశుద్ధ్య పనులపై స్థానికుల ఫిర్యాదులను తీసుకొని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటున్న స్థానిక శానిటేషన్ కార్యదర్శి ఎం.రాజకుమారిని విధుల నుంచి సస్పెండ్ చేయాలని సీఎంఓహెచ్‌ని ఆదేశించారు. అనంతరం శంకర్ విలాస్ ఆర్‌ఓబీ మార్కింగ్‌ని అరండల్‌పేట మెయిన్ రోడ్‌లో పరిశీలించి, మార్కింగ్ వేగవంతం చేసి నివేదిక ఇవ్వాలని, అందుకు తగిన విధంగా సిబ్బందిని కేటాయించుకోవాలని ఏసీపీని కోరారు. పర్యటనలో ఈఈ సుందర్రామిరెడ్డి, డీఈఈ కళ్యాణ రావు, ఏసీపీ రెహ్మాన్, ఎంహెచ్ఓ ఆనందకుమార్, స్పెషల్ శానిటేషన్ ప్రత్యేక అధికారి నిరంజన్, ఎస్ఎస్ సోమశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఎ.బాబు పాల్గొన్నారు.

అర్జీలను వారం రోజుల్లో పరిష్కరించాలి

నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థ చేపట్టే డయల్ యువర్ కమిషనర్, ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో ఇస్తున్న అర్జీలను వచ్చే వారానికి పరిష్కారం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. సోమవారం కమిషనర్ ఛాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, అనంతరం కౌన్సిల్ హాల్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి 25 ఫిర్యాదులు అందాయని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సీహెచ్ ఓబులేసు, డెప్యూటీ కమిషనర్లు సీహెచ్ శ్రీనివాస్, డి.శ్రీనివాస్, సిటీ ప్లానర్ రాంబాబు, సీఎంహెచ్ఓ డాక్టర్ శోభారాణి, ఎంహెచ్ఓ డాక్టర్ రవి, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటాం

కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఇటీవల మరణించిన ప్రజారోగ్య విభాగం ఔట్ సోర్సింగ్ కార్మికులు సిహెచ్.లోకరాజు, జె.దేవరాజు, ఎ.ముత్తు కుమార్ కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల ఎక్స్ గ్రేషియా చెక్‌లను సోమవారం అందించారు.